ఒలింపిక్స్ ముగింపు వేడుకలు అర్ధరాత్రి 12:30 నుంచి స్పోర్ట్స్18లో

త్రుటిలో ఏడు చేజారె

నాలుగో స్థానంతో భారత్ కోల్పోయిన పతకాలు • ఒలింపిక్స్‌లో మన ప్లేయర్లకు చేదు అనుభవం

నాలుగేండ్లకోసారి ప్రపంచ క్రీడాభిమానులను అలరించే ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌లో పతకమనేది ఒక ప్లేయర్ జీవిత లక్ష్యం! విశ్వక్రీడా వేదికపై కనీసం ఒక్కసారైనా పతకాన్ని ముద్దాడాలనే నేపథ్యం. అందుకోసం ప్లేయర్లు పడని కష్టమంటూ ఉండదు. అయినవారి అందరికీ దూరంగా రోజులకు రోజులు పగలు, రాత్రి అన్న తేడా లేకుండా నిరంతరం శ్రమిస్తుంటారు. ఒకే ఒక్క ఆలోచనతో లక్ష్యంగా ముందుకు సాగుతుంటారు.

పతకం సాధించిన సమయంలో తాము ఇన్ని రోజులు పడిన ప్రయాసను మరిచి విజయాన్ని ఆస్వాదిస్తుంటారు. ప్రపంచమంతా ఒకచోట పోటీ పడే ఒలింపిక్స్‌లో పతక సాధనకు ప్రతిభ ఒక్కటే గీటురాయి కాదు. విశ్వక్రీడల్లో పోటీ అంటేనే అత్యుత్తమ నైపుణ్యమున్న ప్లేయర్లు బరిలో ఉంటారు. ప్రతిభకు అదృష్టం తోడైతేనే పతకం మన చెంతకు చేరుతుంది. లేకపోతే మరో నాలుగేండ్లు నిరీక్షణ తప్పదు.

ప్రస్తుతం జరుగుతున్న పారిస్ ఒలింపిక్స్‌లో భారత ప్లేయర్లు నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో చేజార్చుకున్న పతకాలు ఏడు. ఇందులో ఒకరిది 100 గ్రాములు తేడా అయితే ఉంకొకరిది 1కిలో వ్యత్యాసం, ఒక పాయింట్ తేడా ఇలా పతకాలు కోల్పోయిన వారే. వీరి ప్రదర్శనకు అదృష్టం కూడా కలిసి వచ్చేదుంటే భారత్ ఖాతాలో మరో ఏడు పతకాలు చేరేవి. పారిస్‌లో భారత్ చేజార్చుకున్న పతకాలపై ప్రత్యేక కథనం.

(నమస్తే తెలంగాణ, క్రీడా విభాగం)

వినేశ్ 'వంద' విలాపం

దురదృష్టమంటే భారత స్టార్ వినేశ్ ఫోగాట్‌దే. పోరాటాన్ని అణువణున నింపుకున్న ఈ హర్యానా మల్లయోధురాలికి పారిస్ ఒలింపిక్స్ అస్సలు కలిసి రాలేదు. రియో(2016), టోక్యో(2020) విశ్వక్రీడల్లో ఎదురైన అనుభవం లాగే పారిస్‌లో వినేశ్‌ను 100 గ్రాముల తేడా అనర్హతకు గురయ్యేలా చేసింది. తన రెగ్యులర్ విభాగానికి భిన్నంగా ఈసారి 50కిలోల కేటగిరీని ఎంచుకున్న వినేశ్..తొలి పోరులోనే జపాన్ దిగ్గజ రెజ్లర్ యుయి సుసాకిని చిత్తు చేసి సంచలనం సృష్టించింది. వరుస బౌట్లలో ప్రత్యర్థులను ఓడిస్తూ ఫైనల్ చేరిన తొలి భారత రెజ్లర్‌గా రికార్డుల్లో కెక్కింది. కానీ మరునాటి ఉదయమే బరువు రూపంలో ఆమె పతక ఆశలు కలలయ్యాయి. నిద్ర, ఆహారం మానేసి ఆఖరికి జుట్టు కత్తిరించుకున్నా..లాభం లేకపోయింది. అంతర్జాతీయ క్రీడా న్యాయస్థానంలో తీర్పు ఎలా వస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

అనుకోకుండా నాలుగులో

అసలు అంచనాలు లేకుండా పోటీకి దిగిన యువ షూటర్లు మహేశ్వరి చౌహాన్, అనంత్‌జీత్‌సింగ్ నరుక అద్భుత ప్రదర్శనతో నాలుగో స్థానంతో ఆకట్టుకున్నారు. స్కీట్ మిక్స్‌డ్‌టీమ్ ఈవెంట్ కాంస్య పతక పోరులో అనంత్, మహేశ్వరి జోడీ 43-44తో చైనా ద్వయం యిటింగ్ జియాంగ్, లు జియాన్‌లిన్ చేతిలో ఓడింది. పాయింట్ తేడాతో భారత షూటర్లు కాంస్యం సాధించే చాన్స్ కోల్పోయారు.

పతకాల పట్టిక

	దే	స్వ	ర	కా	మొ
1	చైనా	37	27	24	88
2	యూఎస్ఏ	35	41	41	117
3	ఆస్ట్రేలియా	18	18	14	50
4	జపాన్	16	12	13	41
5	ఫ్రాన్స్	15	22	22	59
6	బ్రిటన్	14	20	25	59
70	భారత్	0	1	5	6

దే : దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

'లక్ష్య'ం నెరవేరలె

బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో తొలి సారి ఒలింపిక్స్ బరిలోకి దిగిన యువ షట్లర్ లక్ష్య సేన్ అద్భుత అవకాశాన్ని చేజార్చుకున్నాడు. అంచనాలకు మించి రాణిస్తూ టోర్నీలో ఆది నుంచే తనకంటే మెరుగైన ర్యాంకింగ్ ఉన్న ప్లేయర్లను ఓడించిన లక్ష్యసేన్..కాంస్య పోరులో తడబడ్డాడు. ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో లక్ష్యసేన్ 21-13, 16-21, 11-21తో లీ జీ జియా(మలేషియా) చేతిలో ఓడాడు. తొలి గేమ్ గెలిచి జోరు మీద కనిపించిన ఈ 22 ఏండ్ల షట్లర్..ఒత్తిడికిలోనై వరుసగా రెండు గేమ్‌లు చేజార్చుకున్నాడు.

కేజీతో కాంస్యం చేజారె

టోక్యో(2020) ఒలింపిక్స్‌లో రజత పతకంతో చరిత్ర సృష్టించిన స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయిచాను..పారిస్‌లో ఆ ఫీట్‌ను పునరావృతం చేయలేకపోయింది. మహిళల 49కిలోల కేటగిరీలో పోటీకి దిగిన మీర 199కిలోలు ఎత్తి నాలుగో స్థానంతో కాంస్యం చేజార్చుకుంది. థాయ్‌లాండ్ లిఫ్టర్ సురోచన కాంబవో(200కి) కేజీ తేడాతో కంచు ఖాతాలో వేసుకుంది. తన చివరి లిఫ్టింగ్‌లో విఫలం కావడం మీరాబాయి పతక అవకాశాలను దెబ్బ తీసింది.

ధీరజ్, అంకితకు నిరాశ

ఆర్చరీలో భారత ద్వయం బొమ్మదేవర ధీరజ్, అంకిత భకత్‌కు నిరాశే ఎదురైంది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సెమీస్‌కు చేరిన తొలి భారత జోడీగా నిలిచిన ధీరజ్, అంకితకు కాంస్య పతక పోరులో తలపడే అవకాశం లభించింది. అయితే అమెరికా ద్వయం బ్రాడీ ఎలీసన్, క్యాసీ కౌఫ్‌ఫోల్డ్ చేతిలో 6-2తో ఓడటంతో కాంస్యం చేజారింది.

ఒలింపిక్స్‌లో భారత్‌కు ఇది కొత్తేం కాదు. దిగ్గజ అథ్లెట్లు మిల్కాసింగ్, పీటీ ఉష, సానియా మీర్జా నాలుగో స్థానంతో ఒలింపిక్ పతకాలను దక్కించుకోలేకపోయారు. మొత్తంగా పారిస్ విశ్వక్రీడల్లో నాలుగో స్థానంలో నిలిచిన మనవాళ్లు మూడులో ఉండుంటే భారత్ ఖాతాలో మరో ఏడు పతకాలు చేరేవి. వచ్చే లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లోనైనా పతకాల్లో భారత్ డబుల్ డిజిట్ మార్క్ అందుకుంటుందని ఆశిద్దాం.

1.4 పాయింట్ తేడాతో

పురుషుల 10మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో భారత యువ షూటర్ అర్జున్ బబుత 1.4 పాయింట్ తేడాతో పతక అవకాశాన్ని కోల్పోయాడు. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన పోరులో అర్జున్ 208.4 పాయింట్లు చేస్తే.. క్రొయేషియా షూటర్ మిలాన్ మారిసిచ్ 209.8 పాయింట్లతో కాంస్య పతకాన్ని ఖాతాలో వేసుకున్నాడు. తొలి ఒలింపిక్స్‌లోనే పతకం సాధిద్దామనుకున్న అర్జున్ ఆశలు నాలుగుతో నీరుగారిపోయాయి.

మను 'హ్యాట్రిక్' మిస్

పారిస్ ఒలింపిక్స్‌లో వేర్వేరు ఈ వెంట్లలో కాంస్య పతకాలు కొల్లగొట్టిన స్టార్ షూటర్ మను భాకర్.. కొద్దిలో కాంస్య పతకాన్ని కోల్పోయింది. 25మీటర్ల పిస్టల్ పోరులో భాకర్.. హంగరీ షూటర్ వెరోనిక మేజర్‌తో వర్గీకరణ షూట్‌లో వెనుకంజతో నాలుగో స్థానంలో నిలిచింది. భాకర్ హ్యాట్రిక్ మెడల్ సాధించే చాన్స్ కోల్పోయింది.

10 గంటల్లో 4.6కిలోలు

బరువు తగ్గేందుకు రాత్రంతా కష్టపడ్డ అమన్

పారిస్: యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ కాంస్య పతక విజయం వెనుక అలుపెరుగని కృషి దాగున్నది. పారిస్ ఒలింపిక్స్‌లో ఎలాగైనా పతకం సాధించాలన్న కసితో వచ్చిన అమన్...అనుకున్నది సాధించాడు. ఈ క్రమంలో 10 గంటల వ్యవధిలో ఏకంగా 4.6 కిలోల శరీర బరువు కోల్పోయి కాంస్య పతక పోరుకు సిద్ధమయ్యాడు. జపాన్ రెజ్లర్, స్వర్ణ పతక విజేత రెయి హిగుచి చేతిలో సెమీస్‌లో ఓడిన తర్వాత అమన్ బరువు 61.5 కిలోలకు చేరుకుంది. శుక్రవారం కాంస్య బౌట్(57కిలో)లో పోటీపడాలంటే 4.6కిలోల బరువు తగ్గాలి. సమయం చూస్తే బరువు కొలిచేందుకు 10 గంటలు మాత్రమే మిగిలుంది. ఇక్కడే కోచ్‌లు జగ్మిందర్‌సింగ్, వీరేందర్ దహియా.. సెహ్రావత్‌తో కలిసి రాత్రంతా నిద్రలేకుండా శ్రమించారు. ఇప్పటికే స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్ 100 గ్రాముల ఉదంతం కండ్ల ముందు కనిపిస్తున్న వేళ మరో పతకాన్ని విడిచిపెట్టుకునేందుకు సిద్ధంగా లేని భారత బృందం ఆ దిశగా ముందుకు సాగింది. సాయంత్రం 6.30(పారిస్ టైమ్)కు బౌట్ ముగిసిన తర్వాత అమన్ 'మిషన్ వెయిట్‌లాస్' మొదలైంది. తొలుత గంటన్నర పాటు మ్యాట్‌పై యువ రెజ్లర్ కుస్తీ ప్రాక్టీస్ చేశాడు. ఆ తర్వాత వేడి నీటితో గంటన్నర స్నానం చేశాడు. రాత్రి 12.30 గంటల సమయంలో జిమ్‌లో నాన్‌స్టాప్‌గా గంట పాటు ట్రెడ్‌మిల్‌పై పరిగెత్తాడు. దీంతో వచ్చే చెమట ద్వారా బరువు కోల్పోయే అవకాశముంటుంది. 30 నిమిషాల విరామం తర్వాత ఐదేసి నిమిషాల చొప్పున ఐదు సెషన్ల పాటు సోనా బాత్ చేశాడు. లాస్ట్ సెషన్ అయిపోయే సరికి ఇంకా 900 గ్రాములు అధికంగా ఉన్నాడు. కొద్దిసేపు మసాజ్ తర్వాత జాగింగ్, 15 నిమిషాల రన్‌తో అమన్..బరువు ఉదయం 4.30 గంటలకు సరిగ్గా 56.9కిలోలకు చేరుకోవడంతో కోచ్‌లు ఊపిరి పీల్చుకున్నారు.

వినేశ్ కేసు తీర్పు ఈనెల 13న

పారిస్: భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ కేసు తీర్పు ఈనెల 13న వెలువడనుంది. 50కిలోల ఫ్రీస్టయిల్ కేటగిరీలో వంద గ్రాముల అధిక బరువుతో అనర్హత వేటుకు గురైన వినేశ్ కేసును అంతర్జాతీయ క్రీడా న్యాయస్థానం(సీఏఎస్) అడ్‌హాక్ డివిజన్ శనివారం విచారింది. వాస్తవానికి శనివారం రాత్రి తీర్పు రావాల్సి ఉన్నప్పటికీ వాయిదా వేసినట్లు తెలిసింది. అయితే ఒలింపిక్స్ ముగిసిన రెండు రోజుల తర్వాత ఈ నెల13న తుది తీర్పు వెలువడనుందని ఐవోఏ వర్గాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ), ప్రపంచ రెజ్లింగ్ సమాఖ్య(యూడబ్ల్యూడబ్ల్యూ) వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయంపై వినేశ్..కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

వినేశ్‌కు హిగుచి మద్దతు

వినేశ్ ఫోగాట్‌కు జపాన్ ఒలింపిక్ చాంపియన్ రెయి హిగుచి మద్దతుగా నిలిచాడు. టోక్యోలో తాను కూడా 50గ్రాముల తేడాతో అనర్హత వేటు ఎదుర్కొన్నానని హిగుచి ఎక్స్‌లో పేర్కొన్నాడు. 'ఆ బాధేంటో నాకు తెలుసు. నీపై వస్తున్న మాటలను పట్టించుకోకు. కుంగుబాటు నుంచి పుంజుకోవడం అద్భుతమైన సందర్భం'అని రాసుకొచ్చాడు.

ఒలింపిక్స్‌లో కాంస్య పతకంతో మెరిసిన భారత హాకీ జట్టుకు శనివారం స్వదేశంలో ఘన స్వాగతం లభించింది. హాకీ ఇండియా ప్రతినిధులతో పాటు అభిమానులు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు తరలివచ్చారు.

పోరాడి ఓడిన రితిక

భారత యువ రెజ్లర్ రితికా హుడా పోరాడి ఓడింది. బరిలోకి దిగిన తొలిసారే మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. శనివారం జరిగిన మహిళల 76కిలోల క్వార్టర్స్ బౌట్‌లో రితిక 1-1(టై బ్రేక్)తో ఐపెరీ మెడెట్ కైజీ(కిర్గిస్థాన్) చేతిలో ఓటమిపాలైంది. వాస్తవానికి ఇద్దరు రెజ్లర్లు బౌట్ ముగిసే సరికి 1-1తో సమంగా ఉన్నా..ఆఖరి పాయింట్‌ను పరిగణనలోకి తీసుకుంటూ కిర్గిస్థాన్ రెజ్లర్‌ను విజేతగా ప్రకటించడంతో రితికకు నిరాశ ఎదురైంది. దీంతో పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్‌లో భారత పోరాటం ముగిసింది.

హిండెన్ మరో బాంబ్

సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బచ్‌పై సంచలన ఆరోపణలు
అదానీ గ్రూప్ షెల్ కంపెనీల్లో రహస్య వాటాలు
భర్తతో కలిసి పెట్టుబడులు పెట్టారంటూ డాక్యుమెంట్ విడుదల
స్వలాభంతోనే అదానీ కేసు పక్కదారి పట్టించారని విమర్శలు

న్యూఢిల్లీ, ఆగస్టు 10: అమెరికాకు చెందిన షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ శనివారం మరో బాంబు పేల్చింది. 'సమ్ థింగ్ బిగ్ సూన్ ఇండియా' అని ఎక్స్‌లో పేర్కొన్న గంటల వ్యవధిలోనే సంచలన ఆరోపణలు చేసింది. ఏకంగా భారత స్టాక్ మార్కెట్ల నియంత్రణ మండలి సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బచ్ లక్ష్యంగా ప్రధాన ఆరోపణలు గుప్పించింది మరి. గతంలో తాము బయటపెట్టిన అదానీ గ్రూప్ కుంభకోణానికి కొనసాగింపుగా.. గౌతమ్ అదానీకి చెందిన విదేశీ డొల్ల కంపెనీల్లో ఆమెకు, ఆమె భర్తకు వాటాలున్నట్టు పేర్కొన్నది. అందుకే అదానీపై పూర్తి విశ్వాసాన్ని ప్రదర్శించడానికి పూరీ ఆశ్చర్యకర రీతిలో ఆసక్తి కనబర్చారని కూడా చెప్పింది. నిజానికి నియంత్రణ పరమైన నిర్ణయాలు కంపెనీకి అనుకూలంగా తీసుకుంటారని తాము ముందే గుర్తించినట్టు తెలిపింది. ప్రస్తుతం పురి, ఆమె భర్త ధవల్ బచ్‌కు బెర్ముడా, మారిషస్‌ల్లోని ఫండ్లలో రహస్య వాటాలున్నట్టు హిండెన్‌బర్గ్ ఆరోపిస్తున్నది. జూన్ 5, 2015లో సింగపూర్‌లో ఐపీఈ ప్లస్ ఫండ్ కోసం అక్కడి బ్యాంకులో ఖాతాను తెరిచారని ఓ విజిల్ బ్లోయర్ డాక్యుమెంట్‌లో పేర్కొంది. గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ నిర్వహిస్తున్న సంస్థల నుంచి 10 మిలియన్ డాలర్ల నిధులు మళ్లింపు జరిగిందనీ ఆరోపిస్తున్నది. ఈ నిధులు సెబీ చైర్‌పర్సన్ సింగపూర్ ఖాతాలోకి బదిలీ అయ్యాయని అంటుండటం గమనార్హం.

మళ్లీ అదానీపైనే..

గత ఏడాది జనవరిలో అదానీ గ్రూప్‌పై సంచలన ఆరోపణలు చేసిన హిండెన్‌బర్గ్.. 18 నెలల తర్వాత మళ్లీ అదే గ్రూప్ లక్ష్యంగా మరో బాంబు పేల్చింది. అదానీ గ్రూపు కంపెనీ ఆర్థిక వ్యవహారాల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ నాడు చేసిన ఆరోపణలతో అదానీ కంపెనీల షేర్లు ఒక్కసారిగా కుప్పకూలిన విషయం తెలిసిందే. దీనిపై దర్యాప్తు చేపట్టిన మార్కెట్ రెగ్యులేటర్ సెబీ.. హిండెన్ బర్గ్ నివేదికను తప్పుబట్టడంతోపాటు దేశీయ మార్కెట్లను అస్థిర పరచడానికి జరిగిన ప్రయత్నంగా కొట్టిపారేసింది. హిండెన్‌బర్గ్.. తమ నివేదికను కొన్ని కంపెనీలతో పంచుకొని తద్వారా వచ్చిన లాభాల్లో వాటాలు తీసుకున్నదని ఆరోపించింది. అంతేగాక నిబంధనల ఉల్లంఘనల కింద 2 నెలల క్రితం నోటీసులనూ జారీ చేసింది. అయితే వీటిని హిండెన్‌బర్గ్ తేలిగ్గానే తీసుకున్నది.

రాయితీలు ఇవ్వకపోతే వెళ్లిపోతం

రేవంత్ సర్కార్‌కు షాకిచ్చిన గల్లా జయదేవ్
గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను కొనసాగించాలి..
లేకపోతే రాష్ట్ర ప్లాంట్ విస్తరణ ప్రణాళికను నిలిపివేస్తాం..
అమరరాజా బ్యాటరీ అధినేత అల్టిమేటం

హైదరాబాద్/మహబూబ్‌నగర్, ఆగస్టు 10: విదేశీ పెట్టుబడులను ఆకట్టుకోవడానికి అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గట్టి షాక్ తగిలింది. రాష్ట్ర పారిశ్రామిక దిగ్గజాలలో ఒకటైన అమర రాజా బ్యాటరీస్ నుంచి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలతోనే తెలంగాణలో సెల్ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నామని, కానీ ఈ హామీలను కాంగ్రెస్ సర్కార్ పెడచెవిన పెడితే మాత్రం ప్లాంట్ విస్తరణ ప్రణాళికను నిలిపివేస్తామని అమర రాజా బ్యాటరీ అండ్ మొబిలిటీ చైర్మన్ జయదేవ్ గల్లా హెచ్చరికలు జారీ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీతోనే ఇక్కడ రూ.9,500 కోట్ల పెట్టుబడితో బ్యాటరీ, సెల్ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చామని, ఆ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రస్తుత సర్కార్ కొనసాగిస్తదని అనుకుంటానని, కానీ వీటిని కొనసాగించకపోతే మహబూబ్‌నగర్ జిల్లాలో ఏర్పాటు చేయతలపెట్టిన బ్యాటరీ తయారీ ప్లాంట్ విస్తరణ ప్రణాళికను నిలిపివేయాలనుకుంటున్నట్లు ఆయన స్పష్టంచేశారు. దీంతో విదేశీ పెట్టుబడుల కోసం అంతర్జాతీయ సంస్థల చుట్టు తిరుగుతున్న రేవంత్ రెడ్డికి తన సొంత ఇలాకాలో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్న సంస్థ నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం విశేషం.

మహబూబ్‌నగర్ జిల్లాలో ఏర్పాటు చేయతలపెట్టిన బ్యాటరీ, సెల్ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమంలో అమర రాజా గ్రూపు చైర్మన్ జయదేవ్ గల్లా, పియాజియో ప్రతినిధులు

సెల్ తయారీ యూనిట్‌కు భూమిపూజ

మహబూబ్‌నగర్ జిల్లాలోని దివిటిపల్లి వద్ద అమర రాజా గ్రూపు ఏర్పాటు చేయతలపెట్టిన సెల్ తయారీ యూనిట్‌తోపాటు బ్యాటరీ ప్లాంట్ తొలి దశ యూనిట్‌కు శనివారం భూమిపూజ చేసింది. అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ అనుబంధ సంస్థయైన అమర రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీ(ఏఆర్ఏసీటీ) ఈ యూనిట్‌ను పియాజియోతో కలిసి నెలకొల్పబోతున్నది. అలాగే గత రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ఈ యూనిట్‌లోనే రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌తోపాటు 16 గిగావాట్ల లిథియం-అయాన్ బ్యాటరీ గ్రీన్ ఫీల్డ్ తయారీ కేంద్రాన్ని నెలకొల్పుతున్నది. ఈ రెండు యూనిట్లకోసం రూ.9,500 కోట్ల పెట్టుబడి పెట్టబోతున్నట్లు గతంలోనే ప్రకటించింది. తొలి విడుతలో భాగంగా 8-10 గిగావాట్ల బ్యాటరీ ప్లాంట్‌కు అయ్యే ఖర్చును కంపెనీ అంతర్గత వనరుల ద్వారా సేకరిస్తున్నట్లు, ఒకవేళ అవసరమైతే ఈక్విటీలను జారీ చేయడం ద్వారా నిధులను సేకరించాలనుకుంటున్నట్లు జయదేవ్ గల్లా తెలిపారు.

- తొలి దశలో బ్యాటరీ ప్లాంట్ కెపాసిటీ 1.5 గిగావాట్లు. దేశీయ పరిస్థితులకు తగ్గట్టుగా బ్యాటరీలను తయారు చేస్తున్నది సంస్థ.
- 260 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేస్తున్న ఈ యూనిట్లు 2031 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నది.
- దీనికి అదనంగా హైదరాబాద్‌లో అడ్వాన్స్‌డ్ ఎనర్జీ రీసర్చ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను నెలకొల్పబోతున్నది.
- పియాజియోతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా లిథియం ఐరన్ ఫాస్ఫేట్, లిథియం-అయాన్ సెల్స్, ఈవీ-3 వాహనాలకు చార్జర్లను అభివృద్ధి చేస్తున్నది.

వాణిజ్య

అరబిందో లాభం 919 కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 10:ప్రముఖ ఔషధ సంస్థ అరబిందో ఫార్మా ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను కంపెనీ రూ.919 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.571 కోట్ల లాభంతో పోలిస్తే 61 శాతం వృద్ధిని కనబరిచింది. కంపెనీ విక్రయాల్లో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకోవడం ఇందుకు కారణమని వెల్లడించింది. ఏడాది క్రితం రూ.6,851 కోట్లుగా ఉన్న కంపెనీ ఆదాయం గత త్రైమాసికానికిగాను రూ.7,567 కోట్లకు ఎగబాకినట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా అరబిందో ఫార్మా వైస్-చైర్మన్, ఎండీ కే నిత్యానంద రెడ్డి మాట్లాడుతూ..గత త్రైమాసికంలో బలమైన వృద్ధిని కనబరిచినట్లు, ముఖ్యంగా అన్ని విభాగాల్లో అత్యధిక వృద్ధిని సాధించినట్లు చెప్పారు. గ్రాస్ మార్జిన్లు పెరగడం వల్లనే లాభాల్లో అత్యధిక వృద్ధి నమోదైందని, 2024-25 మొత్తం ఆర్థిక సంవత్సరంలో అంచనాలకుమించి రాణిస్తామన్నా ధీమాను ఆయన వ్యక్తంచేశారు.

ఆకర్షణీయ డిపాజిట్ పథకాలు తేవాలి

- **బ్యాంకులకు సీతారామన్ సూచన**

న్యూఢిల్లీ, ఆగస్టు 10: డిపాజిట్‌దారులను ఆకట్టుకునేలా బ్యాంకులు ఆకర్షణీయమైన డిపాజిట్ పథకాలు అందుబాటులోకి తీసుకురావలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకులకు సూచించారు. రిజర్వు బ్యాంక్ బోర్డు సమావేశం అనంతం మంత్రి మాట్లాడుతూ..రుణాలకు, డిపాజిట్లకు సమతూకం ఉండాలని, డిపాజిట్ల సేకరణపై బ్యాంకులు దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని, తద్వారా వచ్చిన నిధులను రుణాలుగా సమకూర్చుకోవచ్చునన్నారు. భారత్‌లో ఇంటి పొదుపు పెరిగిపోతున్నదని, దీంతో వారు తమ పొదుపును ఇతర ప్రత్యామ్నాయ పెట్టుబడి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి బ్యాంకులు మరింత చొరవ చూపించాలని ఆమె సూచించారు. ఇందులో భాగంగా వినూత్న, ఆకర్షణీయమైన డిపాజిట్ పథకాలను అందుబాటులోకి తీసుకురావలని, తద్వారా ఎంతోమంది డిపాజిట్లు చేయడానికి ముందుకొచ్చే అవకాశాలుంటాయన్నారు.

ద్వితీయ శ్రేణి నగరాలకు ఏఐ సంస్థలు

- టీ కన్సల్ట్ చైర్మన్ సందీప్ కుమార్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలోని ద్వితీయ శ్రేణి నగరాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అంతర్జాతీయ కంపెనీలను సిద్ధంగా ఉన్నాయని టీ కన్సల్ట్ చైర్మన్ సందీప్ కుమార్ అన్నారు. కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్, నల్గొండ, ఆదిలాబాద్ జిల్లా లో 30కి పైగా ఏఐ కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయని, ఏఐ హబ్ తరహాలో ఎదగాలన్న తెలంగాణ లక్ష్యం దిశగా టీ కన్సల్ట్ పనిచేస్తున్నదని వివరించారు. తద్వారా భారీ పెట్టుబడులతోపాటు 4 వేల ఉద్యోగాలు రాబోతున్నట్లు చెప్పారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.